
# ఓడలు - బళ్లు

- కోనే నాగ వెంకట ఆంజనేయులు.



మండు వేసవి! సూర్యాస్తమయ వేళ!

ఉదయం నుండీ నిప్పులు కురిపించిన భాస్కరుడు పడమర దిక్కున భాస్వరంలా ఇంకా మండిపడుతూనే నదీగర్భంలోకి జారిపోతున్నాడు.

కొత్తగా తయారై రంగులతో సింగారించుకున్న ఓడలు బళ్లమీద నదీతీరానికి చేరుకుంటున్నాయి ప్రథమ ప్రయాణానికి సిద్ధమై!

పక్షులన్నీ గూళ్లకు చేరుకుంటున్నాయి.

అప్పుడే ఆఫీసు నుండి అలసిపోయి ఇంటికి చేరిన జనార్ధనం సోఫాలో రిలాక్స్ అవుతున్నాడు.

అలవాటు ప్రకారం భార్య తీసుకురాబోయే కాఫీ కోసం రోజూలాగే ఎదురు చూడసాగాడు కళ్లు మూసుకుని సోఫాలో వెనక్కు వాలిపోయి.

భార్య అడుగుల సవ్వడికి కళ్లు తెరిచాడు.

'మీ నాన్నగారి దగ్గర నుండి ఉత్తరం' అంటూ ఓ పోస్ట్ కార్డ్ అందించింది అతని భార్య నీరజ కాఫీ కప్పు కంటే ముందుగానే.

ఆ అందించడంలోని విసురు- జనార్ధనానికి ఉత్తరంలోని సారాంశాన్ని చదవకుండానే గ్రహించగలిగేలా చేసింది.

సారాంశం అతను ఊహించిందే!

'బాబూ... ఈ పల్లెటూర్లో ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ ఉండలేకపోతున్నామురా. నీకు ఇంతకుముందు చెప్పినట్లుగానే సామాన్లు అన్నీ అమ్మేసి పద్నాలుగో తారీఖున నేను, అమ్మ మీతో శాశ్వతంగా ఉండిపోవడానికి వస్తున్నాము.'

ఎప్పుడో ఒకప్పుడు ఈ పరిస్థితి వస్తుందన్న విషయం జనార్ధనం ఊహించిందే!

'ఈ వయసులో అమ్మ ఏ పనీ చేసుకోలేకపోతోందిరా అబ్బాయ్! ఇద్దరం నీ దగ్గరకు వచ్చేసి విశ్రాంతిగా కాలం గడపాలని వుందిరా!' అంటుండేవాడు జనార్ధనం తండ్రి- అతను ఎప్పుడు తల్లిదండ్రుల్ని చూడడానికి పల్లెకు వెళ్లినా!'

ఇప్పుడు ఈ ఉత్తరం చదవగానే అతని గుండె జారిపోయింది. ఇకముందు తన ఇంటి పరిస్థితి ఎలా ఉండబోయేదీ అతనికి సూచనప్రాయంగా తెలిసిపోతూనే వుంది. ఇంక ఇంట్లో రోజూ తను చూసేది నరకమేనన్న ఊహ అతన్ని వణికింపజేస్తోంది.

త్రాగుతున్న కాఫీ చేదుగా మారిపోయి గొంతు దిగనంటోంది. తమ పెళ్లయిన ఈ రెండేళ్లలోనే భార్య సంగతి పూర్తిగా అర్థమైపోయింది అతనికి.

తమ ఇంట్లో తనూ, తన భర్త తప్ప- భర్త తరఫు మరో మనిషి ఉనికి సహించలేని స్వార్ధపరురాలామె.

అయినా స్వార్ధానికి కూడా హద్దు వుండాలి కదా!

తల్లిదండ్రులకు జనార్ధనం ఒక్కడే సంతానం. ఏ మూడు, నాలుగు నెలలకో ఒకసారి కొడుకు ఇంటికి వెళ్లి హాయిగా పది-పదిహేను రోజులు విశ్రాంతిగా గడపాలని అందరు తల్లిదండ్రుల్లాగే వారూ కోరుకుంటుంటారు. ఆ వున్న కాసిని రోజులూ భార్య వాళ్లను సంతోషంగా ఉండేలా చూసుకుంటే ఏం తరిగిపోతుందని బాధపడుతుంటాడు జనార్ధనం.

కానీ అది చెప్పుకున్నంత తేలికైన విషయం కాదని అనుభవం మీద గానీ గ్రహించలేకపోయాడు జనార్ధనం.

పదిహేనో, ఇరవయ్యో రోజులు కొడుకు ఇంట్లో గడిపిన తరువాత మళ్లీ పల్లెకు తిరిగి ప్రయాణమైపోతుండేవారు ఆ ముసలి తల్లిదండ్రులు.

కోడలి మనస్తత్వం తెలిసిన జనార్ధనం తల్లిదండ్రులు కొడుకు ఇంటికి వచ్చిన ప్రతిసారీ కోడలికి అణిగిమణిగి ఎంతో అణుకువగా ఉంటుంటారు.

కోడలు ఎప్పుడు పెడితే అప్పుడు తినడం, ఏం చెబితే అది చేయడం, ఎలా ఉండమంటే అలా ఉండడం వాళ్లకు అలవాటైపోయింది ఈ రెండేళ్లలోనే.

తల్లిదండ్రులు తన దగ్గరకు వచ్చి వున్న ఆ

## శివ! శివ!

ఓట్ల కోసం
ప్రజా సేవ
సీట్ల కోసం
పాద సేవ
పదవి కోసం
నోట్ల సేవ
ప్రజాస్వామ్యం
శివ! శివ!

\- వై.కె.మూర్తి.

కొద్ది రోజులూ భార్య నోటి దురుసుతనం కారణంగా ఇంట్లో నరకం అనుభవించడం జనార్ధనానికి కొత్తేమీ కాదు.

ఇప్పుడు తల్లిదండ్రులు శాశ్వతంగా పల్లెను వదిలి వచ్చి తనతోనే శాశ్వతంగా ఉండబోతున్నారంటే-

ఇకపై ఇంటి పరిస్థితులు ఇంకెంత దారుణంగా ఉండబోతున్నాయో ఊహించుకుంటుంటే అతనికి వెన్నెముకలో వణుకొచ్చి ముచ్చెమటలు పోస్తున్నాయి.

ఏ పిల్లి మీదో, ఎలుక మీదో వంకబెట్టి అత్తమామలు తేరగా తినిపోవడానికి వచ్చారన్నట్లు నేర్పుగా మాట్లాడటం నీరజకు వెన్నతో పెట్టిన విద్య.

జనార్ధనం నోరు మెదపలేదు. మెదిపితే ఏం జరుగుతుందో అతనికి అనుభవమే!

పెళ్లయిన కొత్తల్లో- ఓసారి ఇంటికి వచ్చిన తల్లిని పుల్లవిరుపు మాటలంటుంటే సహించలేక జనార్ధనం మధ్యలో కలుగజేసుకుని నీరజను కోప్పడ్డాడు.

అంతే! అతనిపై ఇంతెత్తున లేచింది నీరజ.

'అమ్మే కావాలంటే పెళ్లెందుకు చేసుకున్నావ'ంటూ వారం రోజులు రగడ చేసి ఇంట్లో నరకం సృష్టించింది.

అంతే! ఆ రోజునుండీ నీరజ- సూటిపోటి మాటలతో తల్లిదండ్రుల్ని ఎంత హింసిస్తున్నా- జనార్ధనం ఎందుకలా అంటున్నావని భార్యని అడిగిన పాపాన పోలేదు.

చాలా కొద్దిరోజుల్లోనే భార్య మనస్తత్వం ఏమిటో అతను సంపూర్ణంగా ఆకళింపు చేసుకున్నాడు- అత్తమామల పొడ అస్సలు గిట్టదామెకు.

ఆ ఉత్తరం వచ్చిన రోజు నుండే భార్యాభర్తల మధ్య మాటల్లేవు.

ఏం మాట్లాడితే ఏం పెడర్థం తీస్తుందోనన్న భయంతో జనార్ధనం ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు.

అత్తమామలు తన సుఖశాంతుల్ని దోచుకోవడానికి వస్తున్నట్లుగా భావిస్తూ నీరజ ముభావంగా ఉండిపోయింది.

మనకిష్టం లేదని కాలం ఎవరికోసమూ ఆగిపోదు కదా!

ఎవరూ ఎదురుచూడని ఆ రోజు రానే వచ్చింది.

వస్తూనే- ముసలివాళ్లిద్దరినీ వెంటబెట్టుకొచ్చింది.

భార్య నోటికి భయపడిన జనార్ధనం- తల్లిదండ్రుల్ని తీసుకురావడానికి రైల్వేస్టేషన్‌కి కూడా వెళ్లలేదు.

తెల్లవారకముందే పెట్టేబేడాతో- పాలవాడి కంటే ముందుగానే 'దిగబడి'పోయిన అత్తమామల్ని నిద్రమత్తులోనే చిరునవ్వుతో సాదరంగా ఆహ్వానించింది నీరజ.

భార్య ముఖంలో కనిపిస్తున్న చిరునవ్వులోని కృత్రిమత్వం జనార్ధనానికి తెలియనిది కాదు.

'స్టేషన్‌లో నీ కోసం చాలాసేపు ఎదురుచూశాం నాన్నా' అన్నది జనార్ధనం తల్లి కొడుకు వైపు ఆపేక్షగా చూస్తూ.

'మెలకువ రాలేదమ్మా' అన్నాడు జనార్ధనం అబద్ధం అమ్మ గ్రహిస్తుందని తెలిసినా.

నిజానికి రాత్రంతా అతనికి నిద్రే లేదు- భవిష్యత్తు కళ్లముందు కరాళ నృత్యం చేస్తుండడంతో.

దేవుడి కొట్టు ప్రక్కనున్న చిన్న గది ఖాళీ చేసి ఉంచాడు జనార్ధనం అప్పటికే.

అందులో దిగారు వృద్ధ దంపతులు.

ఆ గదిలో వున్న చిన్న అల్మరాలో తమ సామానులు, బట్టలు సర్దుకున్నారు.

'గది సౌకర్యంగా వుందిరా అబ్బాయ్!' అన్నాడతని తండ్రి.

'నాన్నా... నీకూ వచ్చా అబద్ధాలాడటం? అవున్లే నువ్వు నా బాబువి కదా!' అనుకుంటూ చిన్నగా నవ్వుకున్నాడు జనార్ధనం- పెచ్చులూడిపోయిన గోడలతో, ఎలుకల బొరియలతో నిండిన ఆ గదిని మరోసారి కలియజూస్తూ.

వచ్చిన వారం రోజుల వరకూ వేళకు సరైన తిండి అందించింది జనార్ధనం తల్లిదండ్రులకు నీరజ.

రోజూ మార్కెట్‌కి వెళ్లి కూరగాయలు తీసుకురావటం, అవసరమైనప్పుడు ఇంట్లోకి కావలసిన పప్పులు, ఉప్పులు ఖరీదుచేసి తీసుకురావడం- జనార్ధనం తండ్రి డ్యూటీ అయిపోయింది.

తండ్రి పడుతున్న శ్రమ చూడలేక జనార్ధనం చాటుగా బాధపడుతుంటే- 'మనింట్లో పని మనం చేసుకోవడం శ్రమెలా అవుతుందిరా అబ్బాయ్' అనేవాడు తండ్రి.

ఖర్చు పెట్టిన ప్రతీ పైసకూ లెక్కజెప్పి మిగిలిన చిల్లర అర్ధ, పావలాలతో సహా కోడలికి తిరిగి అప్పజెప్పే తండ్రిని చూస్తే జనార్ధనానికి ఎంతో జాలి కలిగేది.

డబ్బును ఏమాత్రం లెక్కచేయకుండా అవసరాలకు ఎంత డబ్బు కావాలంటే అంత- బీరువాలోంచి తీసి ఇచ్చే తన చిన్నప్పటి తండ్రి జ్ఞాపకం వచ్చేవాడు అతనికి.

ఎంత డబ్బు ఖర్చయినా- ఏం చేశావనిగానీ, లెక్క చెప్పమనిగానీ అడిగేవాడు కాదు భార్యని. జనార్ధనం తల్లి కూడా వృథా ఖర్చులేమీ చెయ్యకుండా- ఆ డబ్బు అవసరాలకు మాత్రమే ఖర్చు చేసేది. కాలం కలసిరాక వ్యాపారంలో నష్టపోవడంతో- ఆస్తులన్నీ పోయి స్వంత ఇల్లు కూడా అమ్మేయవలసి వచ్చింది వాళ్లకు- జనార్ధనం తొమ్మిదో తరగతిలో వున్నప్పుడే.

ఆర్ధికంగా చితికిపోవడంతో- వున్న ఒక్కగానొక్క కొడుకుని పెద్ద చదువులు చదివించలేకపోయానని బాధపడుతుంటాడు అతని తండ్రి ఎప్పుడూ.

కష్టపడి డిగ్రీ పూర్తిచేసిన జనార్ధనం- అంత కష్టమూ పడి ఓ చిన్న ఉద్యోగం సంపాదించుకుని కాలం గడుపుతున్నాడు పట్నంలో.

ఉద్యోగం రాగానే ఎవరో తీసుకువచ్చిన సంబంధం నచ్చడంతో నీరజను పెళ్లి చేసుకున్నాడు జనార్ధనం తల్లిదండ్రుల ఆశీర్వాదాలతో.

'తిష్టవేసి' రెండు నెలలు గడిచిపోవడంతో అత్తమామలపై నీరజ చిర్రుబుర్రులు అధికమయ్యాయి.

తినగా తినగా తీయదనమే వెగటు కలిగిస్తే ఇక చేదు గురించి చెప్పేదేముంది?

అత్తమామలు తన భర్త మీద పడి అతను సంపాదిస్తున్నదంతా 'మెక్కేస్తున్నార'న్నట్లుగా మాట్లాడటం మొదలుపెట్టింది నీరజ.

తన భర్త కాకముందే అతను వాళ్ల కొడుకు అన్న విషయానికి ఎప్పుడో తిలోదకాలిచ్చేసిందామె.

ఆ అద్దె ఇల్లు ముసలి వాళ్లిద్దరి రాకతో ఇరుకైపోయిందనీ, రేపు పిల్లా పాపా పుడితే ఎలా సర్దుకోవడం అంటూ జనార్ధనం దగ్గర సణగడం మొదలుపెట్టింది- అదీ అత్తమామలిద్దరికీ వినబడేలా!

పండక్కో పబ్బానికో ఏ స్వీటో చేసినా తనకూ, భర్తకూ తప్ప ఆశగా ఎదురుచూసే ముసలి వాళ్లిద్దరికీ ఇంత ముక్క అయినా విదిల్చేది కాదు.

తెగించి బజారు నుండి ఏ స్వీట్‌ప్యాకెట్టో తీసుకువచ్చి తల్లికి ఇద్దామన్నా అదొక ప్రహసనమూ, పెద్ద తప్పూ అయి కూర్చుంటుందని తెలిసి జనార్ధనం ఆ ప్రయత్నం చేసేవాడు కాదు.

ఏ సాయంత్రంపూటో బజారు వైపు వెళ్లినప్పుడు జనార్ధనం తండ్రి ఓ మూడు రూపాయలు పెట్టి ఏ కాజానో, మైసూర్‌పాక్ ముక్కో తీసుకువచ్చి చాటుగా తల్లికి ఇస్తుండటం చూసిన జనార్ధనం మనసు చివుక్కుమనేది. కళ్లు తడిబారేవి.

తన చిన్నతనంలో తనకు ఇష్టమని తల్లి రోజంతా కష్టపడి రకరకాల స్వీట్లు- అరిసెలు, బొబ్బట్లు, మైసూర్‌పాక్- ఇలాంటివి చేసి డబ్బాలకు ఎత్తే సంఘటనలు జ్ఞాపకం వచ్చేవి అతనికి.

ఇంటి చుట్టుపక్కల వాళ్లకు కూడా- పిన్నిగారూ! రుచి చూడండి అనో, వదినా- అన్నయ్య గారికి పెట్టండి అనో గిన్నెలకు గిన్నెలు స్వీట్లు పంపించే అమ్మకు పట్టిన గతి చూసి అతని

ప్రాణం గిలగిలలాడేది.

తను ఆ ఇంటి యజమానురాలిగా, అత్తమామలు తన ఇంటి పనివాళ్లుగా భావించేది నీరజ.

యజమానురాలికి పనివాళ్లు ఎప్పుడూ లోకువే కదా! వాళ్ల పట్ల గౌరవ మర్యాదలు చూపాల్సిన అవసరమేముంది?

ఏదో ఒక విధంగా– ఏదో గొడవ పెట్టుకుని వాళ్లను ఇంట్లో నుండి పంపించేయాలన్నది ఆమె ఉద్దేశ్యమన్న విషయం గ్రహించలేనంత పిచ్చివాడు కాదు జనార్ధనం.

ఆమె ప్రయత్నాలు ఫలించి, ఆమె పథకాలు పారి, ఆమె తపస్సు ఫలించిన రోజు రానే వచ్చింది.

ముసలి వాళ్లిద్దరూ తమంతట తామే ఇంట్లోంచి వెళ్లిపోదామనే నిర్ణయం తీసుకునేలా పరిస్థితుల్ని కల్పించిందామె.

సంవత్సరం గడిచేసరికి ముసలివాళ్లిద్దరికీ ఇంక ఆ ఇంట్లో ఉండటం నరకప్రాయంలా తోచసాగింది. మళ్లీ పల్లెకు వెళ్లిపోయి– ఎవరితోనూ, ఎలాంటి మాటలూ పడకుండా స్వతంత్రంగా అక్కడే బ్రతికినంత కాలం గడిపేయాలనే నిర్ణయానికి వచ్చారు.

అన్నీ ఆలోచించుకుని ఒకరోజు–

'బాబూ! మేము మన ఊరికే మళ్లీ వెళ్లిపోతాం నాన్నా! అక్కడి మనుషులు, ఆ అనుబంధాలు అన్నీ జ్ఞాపకం వస్తున్నాయిరా! మమ్మల్ని అక్కడికే పంపించెయ్యి. శేష జీవితం కృష్ణా! రామా! అనుకుంటూ పుట్టిపెరిగిన ఆ ఊళ్లోనే గడిపేస్తాం' అని ప్రార్థిస్తున్న తండ్రి మాటలు జనార్ధనం గుండెలను కలచివేశాయి.

తన ఇంట్లోంచి తిరిగి పల్లెకు వెళ్లిపోవాలన్న నిర్ణయం తండ్రి ఎందుకు తీసుకున్నాడో ఊహించలేనంత వెర్రివాడు కాదు జనార్ధనం.

చేతులు జోడించి, 'నన్నీ నరకం నుండి బయటపడేయ్ తండ్రీ' అంటున్నట్లు కళ్లనీళ్లు పెట్టుకుంటున్న తల్లి ముఖం చూడలేక తల దించుకున్నాడు జనార్ధనం.

'ఇంత అశక్తుణ్ణి ఎందుకు కన్నావమ్మా' అని మనసులోనే కుమిలి కుమిలి రోదించాడు.

వాళ్లు తిరిగి పల్లెకు వెళ్లిపోవడంలోనే అందరికీ 'సుఖం' వున్నదని గ్రహించిన జనార్ధనం– తల్లిని, తండ్రిని తమ పల్లెటూరు తీసుకుపోయి అయినవాళ్ల మధ్యలో వుండేలా ఓ అద్దె ఇంట్లో దింపి– కావలసిన వస్తువులు, పప్పులు, ఉప్పులు కొనిచ్చి అప్పుడప్పుడూ వచ్చి చూస్తుంటానని మాటిచ్చి కొంత డబ్బు తల్లి చేతిలో వుంచి– తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి వెళ్లిపోయాడు.

తిరిగి తన ఇంటికి వచ్చేసిన జనార్ధనానికి తన ఇల్లు బోసిపోయినట్లు అనిపించింది. సంవత్సరంపాటు కష్టమో, నష్టమో భరించి– తల్లి తండ్రి తిరిగిన ప్రదేశాలు చూస్తుంటే అతని మనస్సును దిగులు ఆవరించింది. నిశ్శబ్దంగా మనసులోనే దుఃఖాన్ని దిగమింగుకున్నాడు.

కాలం కరుగుతూ అన్ని దిగుళ్లనూ మరిపింపజేస్తున్న దశలో–

ఓ శుభవార్త జనార్ధనం చెవిలో వేసింది నీరజ.

త్వరలో జనార్ధనం తండ్రి కాబోతున్నాడనేదే ఆ శుభవార్త.

తనను తండ్రిని చేయబోతున్న భార్య మీద అకస్మాత్తుగా ప్రేమ పొంగిపొర్లింది జనార్ధనం మనసులో.

కారణం–

గర్భవతియైన ఆమె ఆలనాపాలనా

## కల

నిన్ను చూసిన క్షణం
నాకు తెలిసింది నాలో
ప్రేమ మొగ్గ తొడిగిన
భావన నాలో నీ కల
అలలెగసినట్లు
కల్పన వాస్తవమైంది

– చిల్లర మహేశ్వరరావు.

చూసుకోవడానికి ఆమెకు తల్లిదండ్రులుగానీ, తోడబుట్టిన వారుగానీ ఎవరూ లేకపోవడమే.

తల్లిదండ్రులకు ఈ వార్త తెలియజేసి మురిసిపోయాడు జనార్ధనం.

వాళ్లు అక్కడినుండే తమ ఆనందాన్ని ప్రకటించారు.

నెలలు నిండుతున్నకొద్దీ ఆమెను కంటికి రెప్పలా చూసుకోసాగాడు జనార్ధనం.

భర్త ప్రేమలో తలమునకలుగా మునిగిపోసాగింది నీరజ.

ఆమె కోరికలన్నీ ఎంత కష్టమైనా తీర్చడం భర్తగా తన బాధ్యతగా భావించసాగాడు జనార్ధనం.

ఆమె తినాలనుకున్నవన్నీ ఎంత ఖరీదైనా క్షణాల్లో కొని తీసుకువచ్చి ప్రేమగా భార్యకు కొసరి కొసరి తినిపించేవాడు. ఆమె ఆనందంగా ఉండటానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేశాడు.

అప్పుడే విధి తన కరకు కోరలు విప్పింది.

జీవితాల్ని ఛిన్నాభిన్నం చేయడంలో తనవంతు పాత్ర నిర్వహించింది.

సజావుగా సాగిపోతున్న వారి జీవితాల్లో అపశృతి తొంగిచూసింది.

గర్భవతిగా వున్న భార్యను డాక్టరు దగ్గర పరీక్ష చేయించి ఇంటికి తిరిగి తీసుకువస్తుండగా- వాళ్లు ప్రయాణిస్తున్న ఆటో- ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో- ఆటోడ్రైవర్‌తోపాటు జనార్ధనం కూడా అక్కడికక్కడే ఆ క్షణంలోనే దుర్మరణం పాలయ్యాడు.

గర్భవతి నీరజ చిన్నచిన్న గాయాలతో ప్రమాదం నుండి తప్పించుకోగలగడం భగవంతుని లీలగానే భావించాలి.

ఉన్న ఒక్క ఆధారమైన భర్త హఠాన్మరణంతో తెగిన గాలిపటమే అయింది నీరజ జీవితం.

దిక్కుతోచని నీరజను ఆదుకుని అక్కున చేర్చుకున్నది వృద్ధులైన ఆమె అత్తమామలే!

జరిగిన ఘోరం తెలిసిన జనార్ధనం తల్లిదండ్రులు పరుగు పరుగున నీరజను చేరుకున్నారు. కొడుక్కి జరపవలసిన ఉత్తర క్రియలన్నీ జరిపించి- పట్నంలోని ఆ ఇంటిని ఖాళీ చేయించి సామాన్లతోపాటు కోడలిని పల్లెలోని తమ అద్దె ఇంటికి తెచ్చుకున్నారు- పుత్రశోకాన్ని దిగమింగుకుని- జనార్ధనం తల్లిదండ్రులు.

ఇటు నీరజ పశ్చాత్తాపంతో కుమిలిపోతోంది.

అత్తమామల పట్ల తను ప్రవర్తించిన తీరు జ్ఞాపకం చేసుకుని సిగ్గుతో చితికిపోసాగిందామె.

ఎవరి దగ్గరైతే తను యజమానురాలిగా ప్రవర్తించిందో- వాళ్ల ఇంట్లోనే తనిప్పుడు పనిమనిషిగా ఉండవలసిన పరిస్థితి వస్తుందేమోనని భయపడసాగిందామె.

అదే సమయంలో అందుకు సిద్ధపడింది కూడా.

కానీ ఆమె భయపడినట్లేమీ జరగలేదు.

మానవత్వం కొలువై వున్నచోట ప్రతీకారం తీర్చుకోవడమన్న ప్రశ్న ఉదయించదు కదా!

ఆమె అత్తమామలు నీరజను తమ కోడలిగా కాక తమ యజమానురాలిగానే భావించి ఆమెకు సేవలు చేశారు.

ఆమెను గాజుబొమ్మ కంటే అపురూపంగా చూసుకుంటూ- ఆమెకు సుఖప్రసవం అయ్యేలా చూశారు.

అత్తమామల అంతులేని ప్రేమానురాగాలలో ఉక్కిరిబిక్కిరవుతూ- నెలలు నిండగానే పండంటి తనయుడికి జన్మనిచ్చింది నీరజ.

నీరజను తమ కూతురిగా చూసుకుంటూ- నీరజ కొడుకులో మరణించిన తమ కొడుకు జనార్ధనాన్ని చూసుకుంటూ మురిసిపోసాగారు ఆ వృద్ధ దంపతులు.

కోడల్ని, మనవడిని అల్లారుముద్దుగా చూసుకోవాలనే తలంపుతో తిరిగి కష్టించి శ్రమపడటానికి నడుంబిగించారు ఆ వృద్ధులు.

తూర్పున అరుణోదయమయింది.

బళ్లమీద నదీతీరానికి చేరుకున్న ఓడలు- ఆ బళ్లనే అవతలి తీరానికి చేరుస్తున్న దృశ్యం మనోహరంగా వుంది.

❑